

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

జన్నారం, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజనం అన్నారు. శనివారం స్థానికప్రభుత్వ జూనియర్‌కళాశాల వద్ద మాట్లాడుతూ లక్షెట్టిపేటలో ప్రభుత్వడిగ్రీ కళాశాల ఉండడంవల్ల సుమారు 40కిలోమీటర్లు జన్నారం మండలం నుంచి వెళ్లడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని మండలంలోని 29గ్రామాల్లో అత్యధికంగా ప్రతిఏడు అధికసంఖ్యలో విద్యార్థులు పాసవుతున్నా రన్నారు. వీరికి ప్రైవేటు కళాశాల తప్ప ప్రభుత్వ డిగ్రీకళాశాల లేక ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే డిగ్రీ కళాశాలేర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వజీర్ సుల్తాన్

మందమర్రిటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వజీర్ సుల్తాన్ తెలిపారు. శనివారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలోని ర్వహించిన చెస్ పోటీలకు ఆయన హాజరై మాట్లాడుతూ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అనేక చెస్ పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో చెస్ అభివృద్ధికి తమ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. వేసవిలో ఉచిత చెస్ శిక్షణ శిబిరాలను కూడా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా చైర్మన్ ఈగ కనకయ్య, మధు, సతీష్, పీఈటీ కుమార్,రేణుక పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

అండర్ 9లో అభిరానందన్, ఆరీఫ్, హేమంత్, అండర్ 11లో రితికేష్, తన్వి, అక్షయ్, మాన్వి, అండర్ 13లో అఖిల్, రిషివరుణ్, సాత్విత, నవ్య అండర్ 15లో విశ్వసృజన్, కార్తీక, మహితలు గెలుపొందగా వీరికి బహుమతులు అందించారు.

విద్య ఆవశ్యకతను తెలుసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు విద్య ఆవశ్యకతను తెలుసుకోవాలని వయోజన జిల్లా విద్యాధికారి పురుషోత్తం అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఓపెన్ 10వ తరగతి, ఇంటర్ అవకాశాన్ని ప్రజ లకు తెలియ జేసే అడ్మిషన్‌లు చేయడంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టాస్ ఓపెన్ 10వ తరగతి, ఇంటర్ అడ్మిషన్‌లకు చివరి తేదీ ఈ నెల 31 వరకు పొడగించారని, జిల్లా నుంచి 2,500 మంది అడ్మిషన్‌లు పొందేలా అధికారులు కృషి చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, టాస్ పరిశీలకులు విజయకృష్ణ, భగీరథ, దామోదర్, సెక్టోరియల్ అధికారి చౌదరి, డీఆర్‌పీ జనార్ధన్, శాంకరి, సుమన్, మెప్మా టీపీఎంలు పాల్గొన్నారు.

సహకార సంఘాల విస్తరణ ఎప్పుడో..?

- బుట్టదాఖలైన గత ప్రతిపాదనలు
- కొత్త మండలాల్లో ఏర్పాటుకాని పీఏసీఎస్‌లు
- సహకార సంఘాలపై దృష్టిసారించని రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో అదనంగా 16 పీఏసీఎస్‌ల ఏర్పాటుకు అవకాశం



మంచిర్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు వెన్నుదన్నుగా ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) విస్తరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రైతులకు పంట రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు అందిస్తూ అండగా నిలవడం సహకార సంఘాల విధి. గత బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినా...అవి బుట్టదాఖలు కావడంతో విస్తరణకు నోచుకోలేదు. కొత్తవి ఏర్పాటు చేయకపోయినా...కనీసం ఉన్నవాటిని కూడా బలోపేతం చేయకపోవడంతో రైతులకు వాటి సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక సంఘాల పరిధి ఎక్కువగా ఉండటంతోపాటు గ్రామాలకు దూరంగా ఉండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మండలాల్లో సహకార సంఘాలు లేకపోవడంతో ఆయా మండలాల రైతులు ఇతర మండలాల్లోని సొసైటీలకు వెళ్లాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాలో కొన్ని సొసైటీల పరిధిలో ఎక్కువ గ్రామాలు ఉండగా, మరికొన్ని సొసైటీలకు తక్కువ గ్రామాలు ఉన్నాయి. దీంతో దూరంగా ఉన్న సొసైటీలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనల దశలో నిలిచిన విస్తరణ....

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగిన అనంతరం ఆ మేరకు రైతులకు సహకార సేవలను మరింతగా పెంచేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సహకార సంఘాల విస్తరణ చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సహకార శాఖ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసింది. అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను కూడా సేకరించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలకు అదనంగా ఎన్ని అవసరం అవుతాయో అంచనా వేసి ప్రతిపాదనలు తయారు చేశారు. సంబంధిత నివేదికలను ప్రభుత్వానికి పంపారు. దీంతో సహకార సంఘాల విభజనకు రంగం సిద్ధంకాగా, డ్రాఫ్టు నోటిఫికేషన్ కూడా జారీ అయింది. సహకార సంఘాల విభజనే తరువాయి అనుకుంటున్న తరుణంలో ప్రభుత్వ నిర్ణయం మరుగున పడింది. 2020 ఫిబ్రవరి 15న ప్రభుత్వం సహకార ఎన్నికలను నిర్వహించింది. ఎన్నికల సమయంలోనే సంఘాలను విస్తరించాలని ప్రతిపాదించగా, కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విస్తరణ ప్రక్రియ ముందుకు సాగలేదు.

నూతన విధానానికి మంగళం....

సహకార సంఘాల ఏర్పాటుకు సంబంధించి గతంలో కేంద్ర ప్రభుత్వం ఒక జాతీయ సహకార విధానానికి శ్రీకారం చుట్టింది. దీని ప్రకారం ప్రతి గ్రామానికి ఒక ప్రాథమిక సహకార సంఘం, ఒక మత్స్య సహకార సంఘం, ఒక పాల ఉత్పత్తి సహకార సంఘం ఉండాలనేది ఈ నూతన సహకార విధానం ఉద్దేశ్యం. కేంద్ర సహకార శాఖ మంత్రిగా అమిత్‌షా బాధ్యతలు చేపట్టిన తరువాత ఏర్పాటు చేసిన జాతీయ సహకార సదస్సులో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నూతన విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకు కూడా అమిత్ షా సూచనలు చేశారు. గత ప్రభుత్వం దీన్ని పెద్దగా... మిగతా 7లో

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి పర్వతనేని రవి

భీమారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెన్నూరు జూనియర్ సివిల్ కోర్టుజడ్జి పర్వతనేని రవి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన భారత చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఇవి ఎంతో ఉపయోగప డతాయన్నారు. ప్రతిచట్టం ప్రజల కోసమే నని, వ్యక్తుల స్వేచ్ఛకు భంగం కలిగించకుండా ఉండేందుకు అనేక చట్టాలను రాజ్యాంగం కల్పించిందన్నారు. చట్టం పరిధికి లోబడి ప్రతి ఒక్కరు నడు చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేత, ఎంఈవో సతీష్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్, పున్నం, నాగులు, రాజేష్ పాల్గొన్నారు.

23న మినీ జాబ్‌మేళా

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు 23న ఉదయం 10.30 గంటలకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మినిజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి రవి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 9110368501 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నస్పూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యలను పరి ష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయు) నాయకులు డిమాండ్ చేశారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందించారు. అంతకు ముందు ప్రధాన రహదారి నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చారు. ప్రధాన ద్వారం ఎదుట ధర్నా, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య మాట్లా డుతూ మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులతో వె ట్టి చాకిరి చేయిస్తున్నరని ఆరోపించారు. కనీస వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కుటుంబాల పోషణకు కనీస వేతనం అవసరమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు దాసరి రాజేశ్వరి, ఎండి రఫియా మాట్లాడుతూ సమస్యలను ప్ర భుత్వం పరిష్కరించడం లేదన్నారు. ఏడునెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు, మూడునెలల మెనూ బిల్లులు ఇతర బిల్లులు చెల్లించకుం డా పెండింగ్ పెట్టారన్నారు. నానా ఇబ్బం దులు పడుతూ ప్రతిరోజు మధ్యాహ్నభోజనం పెట్టుతున్నమన్నారు. సమస్యలను పరిష్కరించి కొత్త మెనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోజనం పెట్టాలంటూన్న మెనూ చార్జీలను పెంచడం లేదన్నారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులు గోమాస ప్రకాష్, నాయకులు దూలం శ్రీనివాస్, దాగంరాజారాం, సీపీఎం నాయకులు సంకె రవి, మధ్యాహ్న భోజన కార్మికులు మానస, వెంకటవ్వ, లత, సునిత, లక్ష్మి, పోసక్క, రబియా, మల్లిశ్వరి పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ సీనియర్ నాయకుడు వెరబెల్లి రఘునాథ్ పేర్కొన్నారు. శనివారం కేరళలోని ఐఐటీ పాలక్కడ్ కన్వొకేషన్‌లో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందించారు. ఐఐటీ పాలక్కడ్ బోర్డు మెంబర్‌గా రఘునాథ్ కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అక్కడ ఘన స్వాగతం లభించింది. రఘునాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


కేరళలోని ఐఐటీ పాలక్కడ్ కన్వొకేషన్‌లో పాల్గొన్న బీజేపీనాయకుడు వెరబెల్లి రఘునాథ్

వేతనాలు చెల్లించండి



పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎస్‌సీడీడీకి వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

నస్పూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్స్‌కు ఏడు మాసాల నుంచి వేత నాలు అందడం లేదని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో శనివారం దళిత అభివృద్ధిశాఖ డిప్యూటి డైరెక్టర్ దుర్గ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సం ద ర్భంగా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ ఏడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నయని, తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలల తరబడి వేతనాల రాకపోవడంతో వర్కర్లు నానాఇబ్బందులు పడుతున్నరని, ప్రతినెల వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. వర్కర్లు వేతనాలు అందక ఆర్థికంగా నానాఇబ్బందులు ఎదుర్కొంటుకుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రతినెల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు శ్రీకాంత్, తిరుమల, రాజేశ్వరి, గంగ, పాల్గొన్నారు.

సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కోటపల్లి మండలంలోని సర్వాయిపేట గ్రామ రైతులు 72 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు వెంటనే ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం చెన్నూరులోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1952 నుంచి 1974 వరకు పట్టా లోపల ఉన్న సుమారు 15 మంది పట్టాదారుల వారసులు 240 ఎకరాల భూమిని ఏళ్లుగా అనుభవిస్తున్నారని కానీ అప్పటి మక్తదారులు కొందరు రైతుల బలహీనతలను ఆసరాగా చేసుకుని 1972లో కొంత మంది పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా చూపిస్తూ పట్టాలు మార్పిడి చేయించుకున్నారన్నారు. కానీ ఏన్నడు కూడా ఆ పట్టాదారులు భూమి అనుభవిం చడం కానీ దున్నడం కానీ చేయలేదన్నారు. వెంటనే మోకా సర్వే చేయించి 1952 నాటి పట్టాదారుల వారసులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, కోట పల్లి మండల నాయకులు పున్నంచంద్, రామయ్య, నాగేశ్వర్‌రావు, నర్సింహులు, వెంకటేష్, శ్రీపాల్, శ్రీనివాస్, వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

సాగు రైతులకు హక్కులు కల్పించాలి

కోటపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వాయిపేట గ్రామంలో ఏళ్లుగా భూ యాజమాన్య హక్కుల కోసం పోరాడుతున్న రైతులకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం పార్టీ జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్‌తో పాటు నాయకులతో కలిసి సర్వాయిపేటలో రైతులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు రాకపోవడంతో ప్రభుత్వం అందించే రైతు బీమా, రైతు భరోసా అందడం లేదని, బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, పున్నంచంద్, రామయ్య, వెంకటేష్, శ్యాంసుందర్, మహేష్‌పాల్గొన్నారు.

నేటి నుంచి గాంధారి మైసమ్మ జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


జాతరకు ఏర్పాట్లు చేసిన అధికారులు

మందమర్రిరూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బొక్కలగుట్ట జాతీయ రహదారి పక్కన ఉన్న గాంధారి మైసమ్మ ఆలయంలో ఆదివారం జరిగే జాతరకు ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొన్నేళ్లుగా జాతరను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహిస్తున్నారు. 2004లో ఇటిక్యాల అయ్యగారు సమక్షంలో మైసమ్మ తల్లి విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. చందాలు పోగు చేసి గుడి నిర్మాణం చేప ట్టారు. దీంతో ప్రతి సంవత్సరం ఆషాఢమా సంలో ఘనంగా మైసమ్మ జాతరను నిర్వహిస్తూ పూజలు చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కోళ్లు, మేకలను బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేశారు. పోలీసుశాఖ, సింగరేణి, క్యాతనపల్లి మున్సిపల్ అధికారుల సహకారం తో జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నేడు జరిగే ఈ జాతరకు మంత్రి వివేక్‌వెంకటస్వామి హాజరు కానున్నారు. మంచిర్యాల డీసీపీ, ఏసీపీ, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్ ఐలు రాజశేఖర్, రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, ఆలయ కమిటీ సభ్యులు కనకయ్య, సత్యనారాయణ, తిరుపతి, సుధాకర్, రాజయ్యలు మూడు రోజుల నుంచి జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

ప్రభుత్వం ఆలయాన్ని అభివృద్ధి చేయాలి..

జక్కుల సమ్మయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు

బొక్కలగుట్టలో రహదారి పక్కన ఉన్న మైసమ్మ తల్లి ఆలయాన్ని ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. ఆలయం సమీపంలో షెడ్లను నిర్మించాలి.

వర్షం వస్తే ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బం దులు పడుతున్నారు. ఆలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేయాలి. భక్తులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించాలి.


ఎన్నికైన భారతీయ మజ్దూర్ సంఘం కమిటీ సభ్యులు

భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కమిటీ ఎన్నిక

మంచిర్యాలక్రైం, జూలై19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా భారతీయ మజ్దూర్ సంఘం జిల్లా కమిటీని శనివారం ఎన్నుకున్నారు. సంఘం మాజీ అధ్యక్షులు లగిశెట్టి కమల్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకోగా జిల్లా అధ్యక్షుడిగా కుంటాల శంకర్, జిల్లా కార్యదర్శిగా మజ్దూరి రాజు యాదవ్, ఉపాధ్యక్షులుగా కిషన్‌రెడ్డి, నీరటి సురేశ్, సగుర్తి ఆనంద్‌రావు, కోశాధికారిగా గగ్గూరి విశాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రత్నాకర్, మహానంద్, సహాయ కార్యదర్శులు శశి, కొండు రాజేందర్, శాంతం సంపత్, కార్యవర్గ సభ్యుడిగా కొరకాని తిరుపతి, కళ, సహజలను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్‌రావు, శ్రీనివాస్, రవి కాంత్, సత్యనా రాయణ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల సంబరాలు

శ్రీరాంపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారు, పోతురాజుల వేషధారణలో అలరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో పాఠశాల నుంచి బయలుదేరి స్థానిక పోచమ్మ ఆలయం వరకు వెళ్లి బోనాలు సమర్పించారు.

డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ సులువు...
- ఇంటి నుంచే చేసుకునే అవకాశం ..

6

గాంధీనగర్‌లో కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

జన్నారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్కల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో శనివారం తెల్లవారు జామున సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అటవీశాఖ, ఎక్సైజ్ శాఖ పోలీసు శాఖల సమన్వయంతో దాడులు నిర్వహించారు. పత్రాలు లేని ద్విచక్రవాహనాలను, నంబర్ ప్లేట్ లేని వాహనాలను స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఐదు లీటర్ల గుడుంబా నిల్వతో పాటు వంద లీటర్ల బెల్లం పాకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ రమణమూర్తి మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల కు పాల్పడిన, సైబర్ నేరాలు చేసిన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలతో పాటు అన్ని వాహనాలకు నిజధ్రువపత్రాలతో పాటు నెంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని హెచ్చరించారు. అదే విధంగా యువత మత్తుకు బానిస కాకుండా ఉండాలని ముఖ్యంగా గంజాయి వంటి వాటికి బానిస కాకుండా చూసుకోవాలన్నారు. గంజాయి వాడకం వల్ల యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని ఈ మత్తులో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. యువత వ్యసనాల బారిన పడకుండా లక్ష్యం కోసం చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. దాడు ల్లో జన్నారం ఎస్ఐ గొల్లపల్లి ఎస్ఐ అనూష, దండేపల్లి, లక్సెట్టిపేట ఎస్ఐలు కహసినోద్దీన్, రామన్న, ఎక్సయిజ్ ఎస్ఐ మౌని కతో పాటు పోలీసు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

జన్నారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నారం గ్రామానికి చెందిన ముజీబుద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు జన్నారం గ్రామానికి చెందిన ఫైమోద్దీన్‌కు వాటా కింద వచ్చిన భూమిని తన భూమి అంటూ ముజీబుద్దీన్ తన సోదరుడు ఫైమోద్దీన్ భార్య సీమను బెదిరింపులకు గురి చేశాడు. అదే విధంగా సోదరుడి భూమిలో గడ్డిమందు చల్లించాడు. దీంతో సీమ శుక్రవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. బాధితురాల ఫిర్యాదు మేరకు ముజీబుద్దీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఫైమోద్దీన్ భార్య సీమ మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

వన్యప్రాణులను హతమార్చకూడదు

సిర్పూర్(టి), జూలై 19 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను హతమార్చకూడదని, ఇది చట్టరీత్యా నేరమని ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానికంగా శనివారం ఆయన మాట్లాడు తూ సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన జల్ల శ్రీను, నికోడే గణపతిల వద్ద ఈ నెల 13న చుక్కల దుప్పి మాంసం ఉన్నట్లుగా సమాచారం వచ్చిందని చెప్పారు. సెక్షన్ ఆఫీసర్ ప్రసాదరావు, బీట్ ఆఫీసర్ రవీనా విచారణ జరిపి నిందితులపై కేసు నమోదు చేశారని అన్నారు. ఈ కేసులో ప్రధాన నింది తుడు భూపాలపట్నం గ్రామానికి చెందిన జల్లా శ్రీను పరారీలో ఉండగా మరో నిందితుడు నికోడే గణపతిని శుక్రవారం కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల డిమాండ్ విధించారని అన్నారు. అనంతరం నిందితుడిని ఆసిఫా బాద్ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. అటవీ జంతువులను చంపడం, వాటి మాంసం తినడం చట్ట రీత్యా నేరమని చెప్పారు. ఎవైనా కారణా లతో అయినా అడవి జంతువులు మరణించినట్లయితే అటవీ అధికారులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం అశోక్ రోడ్‌కు చెందిన బైరి రమేశ్(36) సింగరేణి గని కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ అజ హరోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం రమేశ్‌కు 12 సంవత్సరాలక్రితం వివాహం అయింది.సింగరేణి గని కార్మికుడైన రమేశ్ అవసరం నిమిత్తం మధ్యవర్తుల ద్వారా రూ.10లక్షలను వడ్డీకి తీసుకున్నాడు. అప్పు తీరకపోవడంతో మనస్థాపానికి గురై ఈ నెల 17న పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య శ్వేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ సులువు

● ఇంటి నుంచే చేసుకునే అవకాశం





వాంకిడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొత్త వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు పొందాలంటే ఇప్పటి వరకు ఓ సుదీర్ఘ ప్రక్రియ. రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగితే కానీ పని పూర్తికాని పరిస్థితి. ప్రస్తుతం అలాంటి బాధలు లేకుండా ఇంటి నుంచే స్మార్ట్ ఫోన్‌లో తీసుకునే అవకాశం రవాణాశాఖ కల్పిస్తోంది. ద్విచక్రవాహనం, కారు, ఏ వాహనం నడపాలన్నా ఆ వాహన ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రంతో పాటు ప్రధానమైనది డ్రైవింగ్ లైసెన్స్. వాహనం నడపాలంటే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. చాలా మంది డ్రైవింగ్ లైసెన్సు రెన్యూవల్‌ను మరిచిపోతుంటారు. కొత్తగా డ్రైవింగ్ లెసెన్స్ తీసుకున్నప్పుడు వయసు ఆధారంగా కొన్నేళ్ల గడువుతో జారీ చేస్తారు. ఈ గడువు ముగిసేలోగా రెన్యూవల్ చేసుకోవాలి. గడువు ముగిసిన 30 రోజుల్లో (గ్రేస్ పీరియడ్) రెన్యూవల్ చేసుకోకుంటే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. గడువు ముగిసి ఎక్కువ రోజు లైతే దాన్ని రద్దు చేసే అవకాశం ఉంది. అందుకే డ్రైవిం గ్ లైసెన్సు పై గడువును చూసుకుని రెన్యూవల్ చేసు కోవడం ఉత్తమం. గతంలో డ్రైవింగ్ లైసెన్సు కోసం రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అరచేతి నుంచే ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు.

● ప్రక్రియ ఇలా..

ముందుగా రవాణాశాఖ అధికారిక వెబ్‌సైట్ లోకి వెళ్లి లైసెన్సు ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ ఎంచుకుంటే మరో పేజీ తెరుచుకుంటుంది. అందులో కింద ఉండే రెన్యువల్ ఆఫ్ డ్రైవింగ్ లైసెన్సు పైక్లిక్ చే యాలి. తర్వాత క్లిక్ హియర్‌టుబుక్‌ది స్లాట్ ఆప్షన్ ఎంచుకోవాలి. మరో కొత్త విండోలో కనిపించే డ్రైవింగ్ లైసెన్స్ బాక్స్‌లోని రెన్యువల్ ఆఫ్ లైసెన్స్, తర్వాత కంటిన్యూ స్లాట్ బుకింగ్‌ని క్లిక్ చేయాలి. ఆ తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ నంబరు, ఆర్టీఏ కార్యాలయం చిరునామా, పుట్టిన తేదీ, సెల్‌ఫోన్ నంబరు తదితర వివ రాలు నమోదు చేయాలి. రిక్వెస్ట్ ఓటీపీని క్లిక్‌చేస్తే మీసెల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాంతో పాటు క్యాప్చాను ఎంటర్‌చేసి గెట్ డిటయిల్స్‌పై నొక్కగానే వివరాలన్నీ కనిపిస్తాయి. జాగ్రత్తగా పరిశీలించి కన్‌ఫాంపై క్లిక్ చేయాలి. తర్వాత మరో విండో లో స్లాట్‌కోసం మనకు నచ్చిన తేదీ, సమయం ఎంచుకుని నెక్స్ట్‌పై క్లిక్ చేయాలి. ఇప్పుడు మనం చెల్లించాల్సిన రుసుం మొత్తాన్ని పరిశీలించి పే నౌపై క్లిక్‌చేస్తే వచ్చిన పేమెంట్ ఆప్షన్లలో మనకు అనువైన దానిని ఎంచుకుని పే చేస్తే స్లాట్ బుక్ అవుతుంది. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వస్తుంది. వీటిని ప్రింట్ తీసుకోవాలి. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌పై వైద్యాధికారి తో సంతకం చేయించి ఆధార్, ఒరిజనల్ డ్రైవింగ్ లైసెన్సును స్లాట్‌బుక్ అయిన రోజున ఆర్టీఏ కార్యాలయంలో అందజేయాలి. కొద్ది రోజుల్లోనే రెన్యూవల్ అయిన డ్రైవింగ్ లైసెన్సు వస్తుంది.

జీవో 49ని రద్దు చేయాలి

వాంకిడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలను, ఇతర నిరుపేదలను జల్ జంగల్ జమీన్‌కు దూరంగా చేసి జీవో 49ని ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని లింబుగూడ, భీమ్‌గూడ గ్రామంలో శనివారం జీవో 49 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవో అమలు తో గిరిజనుల మనుగడ లేకుండా పోతుందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి జీవో రద్దుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, జలపతి, తిరుపతి, దేవరావు, జైతు, మారు, లక్ష్మణ్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

జీవో 49ని రద్దు చేయాలని తీర్మానం

కెరమెరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌపన్‌గూడలో ఆదివాసీలు జీవో 49ని రద్దు చేయాలని శనివారం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసే కుట్ర జరుగుతుందని చెప్పారు. ఆదివాసీ లందరూ జీవోకు వ్యతిరేకంగా గ్రామసభలు ఏర్పాటు చేసి రద్దుకు తీర్మానం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం జీవోను ఉపసంహరించుకునే దాకా ఆందోళనలు చేపట్టాలని సూచిచారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సర్‌మేడి బొజ్జిరావు, ఆనంద్‌రావు, యాదవ్‌రావు, రాము, వసంత్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు మానసికోల్లాసం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, పోలీసులు

జైనూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యువతకు క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు ఏఎస్పీ చిత్తరంజన్ పర్యవేక్షణలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల క్రీడాకారులకు వాలీబాల్ పోటీలను పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ప్రారంభించారు. పోటీలను మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, సీఐ వెల్పుల రమేశ్, ఎస్సై రవికుమార్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేలా పోలీసులు పోటీలు నిర్వహిం చడం అభినందనీయమని కొనియాడారు. అంతకు ముందుకు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆటగాళ్లకు సీఐ రమేశ్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కుమరంభీం మనుమడు కుంరం సోనేరావ్, గుస్సాడీ టీం బృందం లీడర్ కనక సుదర్శన్, నాయకులు మేస్రాం అంబాజీ, కుంర శాంరావ్, మాజీ వైస్ ఎంపీపీలు చిర్లేలక్ష్మణ్, షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో మెనూ పాటించాలి

దహెగాం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వడ్డించే భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో శ్రీనివాస్, ఎంపీడీవో అల్బర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, వంట సరుకులు పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాలయ ఆవరణలో చెత్తాచెదారం తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వీరి వెంట ఏపీవో కల్పన, తదితరులు ఉన్నారు.

వసతిగృహం తనిఖీ

కౌటాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని శనివారం తహసీల్దార్ ప్రమోద్ తనిఖీ చేశారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నదని చెప్పారు. బీసీ సంక్షేమాధికారి బాలరాజ్ వంటశాల, మరుగుదొడ్లు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కోడిగుడ్ల సరఫరాకు టెండర్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు ఆగ్మార్క్ నియమాల ప్రకారం కోడిగుడ్ల సరఫరా చేసేందుకు టెండర్లు తీసుకుని ఖరారు చేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి ఆన్‌లైన్ టెండర్ల స్వీకరణపై అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రీ బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు ఆగ్మార్క్ నియమాల ప్రకారం అవసరమైన కోడిగుడ్లను సరఫరా చేసేందుకు టెండర్లు నిర్వహిస్తామని అన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో అవరమయ్యే 2 కోట్ల 6 లక్షల 33 వేల, 123 గుడ్లను సరఫరా చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు స్వీకరించనున్నామని చెప్పారు. ఈ నెల 21 తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు బిడ్ డాక్యూమెంట్లను డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లో బిడ్‌లను సమర్పించాలని తెలిపారు. సమర్పించిన బిడ్‌ల హార్డ్ కాపీలను ఆగస్టు 6వ తేదీన కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఆగస్టు 7న టెక్నికల్ బిడ్‌లు, ఆగస్టు 8న ధరల బిడ్‌లను తెరవనున్నామని తెలిపారు. టెండర్లు సమర్పించే కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం అవసరమయ్యే ధ్రువపత్రాలను టెండర్లతో జతపర్చాలని సూచించారు. వివరాలు అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, విద్యాశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ రూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల విజయ బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ నుంచి నాణ్యమైన పాలను సరఫరా చేయా లని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రం లోని విజయ బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ను శనివారం సందర్శిం చారు. యూనిట్‌లో బల్క్ మిల్క్, కూలింగ్ యంత్రా లను, పాలను శుద్ధి చేసే యంత్రాలను పరిశీలించి పాలు సేకరించడం, సరఫరా చేస్తున్న వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ తెలంగాణ పాడి పరిశ్రమ, సహకార సమాఖ్య విజయ పాల డెయిరీ ఆధ్వర్యంలో జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠ శాలలకు పాలు సరఫరా అవుతున్నాయని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా నాణ్యమైన పాలను సర ఫరా చేయాలని తెలిపారు. విద్యార్థులకు అందించే పాలు పూర్తి పోషకాలతో నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో యూనిట్ మేనేజర్ నవీన్, సరఫ రాదారుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ ఫిర్యాదులకు హెల్ప్‌లైన్ నంబర్

శ్రీరాంపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి పింఛన్, మరేదైనా సమస్యపై స్పందించేందుకు హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేయడం సంతోషదాయకమని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి బి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు 9211053010 నంబర్‌ను ఏర్పాటు చేస్తూ సీఎంపీఎఫ్ ధన్‌బాద్ కమిషనర్ అన్ని ప్రాంతీయ కార్యాలయాల అధిపతులకు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఏదైనా ఫిర్యాదు అందిన రెండు గంటల్లోపు సమస్య పరిష్కారం అవుతుందని వారు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం యాజమాన్యం కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇస్తున్న ఉచితంగా టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగాలని ఎస్పీఎం వైస్ ప్రసిడెంట్ ఏకే మిశ్రా అన్నారు. కోయవాగులో శనివారం టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ ఎం యాజమాన్యం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ హెచ్ఆర్ ఐఆర్ ఎంఎస్ గిరితో పాటు మిల్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి సాధించాలి



బెల్లంపల్లి ఏరియాలోని గనులను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): లక్ష్యానికి అను గుణంగా బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె వెంకటేశ్వర్లు అన్నారు. జీఎం కార్యాలయంలో జీఎం ఎం శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె వెంకటేశ్వర్లు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యానికి అనుగుణంగా బొగ్గును ఉత్పత్తి చేయాలని, వీలైనంత త్వరగా రవాణా చేయాలని సూచించారు. అన్ని పనులు సక్రమంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాలలో ఎస్ఓ టు డైరెక్టర్ మెహతా, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యద ర్శి బాజీసైదా, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ సాంబశివరావు, పీవోలు ఏవీ రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవి కుమార్, డీజీఎంలు రాజన్న, రవీందర్, ఆనంద్ కుమార్, శిరీషా రెడ్డి, హరినారాయణ, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు ముస్కె సమ్మయ్య, కొమురయ్య, కిషన్ రావు, పిట్ కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఉద్యోగులకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాను శనివారం ఆయన సందర్శించారు. ఏరియా జీఎం ఎం శ్రీనివాస్‌తో కలిసి జీఎం కార్యాలయంలో శిశు సంరక్షణ కేంద్ర, నస్పూర్ కాలనీలో గోదావరి ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించి, ఉద్యోగులతో రక్షణ, ఉత్పత్తిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం 20 లక్షల రూపా యలతో ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణకు శిశ సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు.

గనుల పరిశీలన

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో వివిధ గనులను సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలిచారు. గోలేటి ఉపరితల గనులను పరిశీలించారు. వర్షాలు కురిస్తే ఉత్పత్తి, ఉత్పాదకత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీఎం ఎంవిజయ భాస్కర్ రెడ్డి, ఖైరిగూడ పీవో మచ్చగిరి, ఎస్ఓ టు జీఎం రాజమల్లు, సెక్యూరిటీ అధికారి ఎస్.ఉమాకాంత్, డీజీఎం (సివిల్) ఎస్‌కె మదీనా బాషా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ వైభవం కోసం టీబీజీకేఎస్ ప్రయత్నం

మందమర్రిటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో యూనియన్ బలోపేతంపై టీబీజీకేఎస్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా గౌరవ అధ్యక్షుడిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించడంతో అన్ని ఏరియాల్లో యూనియన్ బలోపేతంపై దృష్టిపెట్టారు. కొప్పుల ఈశ్వర్ సింగరేణిలోని 11 ఏరియాల్లో పర్యటించేందుకు ప్రణాళిక రూపొం దించడంతో నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఫోకస్ చేసేందుకు నాయకులు ఇప్పటికే గౌరవాధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఏరియాల్లో నూతన కమిటీ నియామకం చేపట్టేందుకు చూస్తున్నారు. కార్మికులకు ఇన్‌కంటాక్స్ రద్దు చేయాలని, సొంతింటి పథకం, మారుపేర్ల మార్పుకు సంబంధించి, విజిలెన్స్‌లో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ సమస్యలపై పోరాటాలు చేయాలని నిర్ణయించినట్లు టీబీజీకేఎస్ నాయకుడు ఒకరు చెప్పారు. రెండేళ్లుగా తటస్థంగా ఉన్న నాయకుల్లో నూతన గౌరవాధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్ నియామకం కావడంతో నాయకుల్లో ఉత్సాహం వచ్చింది. మరో వారం రోజుల్లో బెల్లంపల్లి రీజియన్‌లో పర్యటించనున్నట్లు తెలు స్తోంది. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేసిన అభివృద్ధిని వివరించనున్నారు. ఇంక్రిమెంటు, కారుణ్య నియామకాలు, లాభాల వాటా పెంపు, ఆర్థిక ప్రయోజనా లపై వివరించనున్నారని చెబుతున్నారు.



సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పీ 3 గని ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు అన్నారు. పిట్ కార్యదర్శి రిక్కల గోపాల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బాయిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సంక్షేమం, భద్రతపై గని యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. గనిలో పనిముట్లు అవసరమైనన్ని లేకపోవడంతో కార్మికులు ఒత్తిడి ఎదుర్కొం టున్నట్లు తెలిపారు. గుడి నిధుల నిర్వహణలో పారదర్శకత లేదని, ఆయా ఖర్చుల వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు గరిగె స్వామి, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, వీరమల్లు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఈపీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి మాట్లాడుతూ ఈపీఆపరేటర్ల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జూపాక రాజేష్, శ్రీనివాస్, యూనియన్ డెలిగేట్స్ గణేష్, సంతోష్ కుమార్, లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ బకాయిలు ఉంటే జరిమానా విధిస్తాం



వ్యాపారికి ట్రేడ్ లైసెన్స్ అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

బెల్లంపల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ బకాయిలు ఉంటే జరిమాణాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు వ్యాపార సముదాయాల వ్యాపారస్తులను కలిసి మాట్లాడారు. వ్యాపార సంబంధిత దుకాణాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్‌ను రీనివల్ చేయించుకోవాలన్నారు. వ్యాపారస్తులు నిబంధనలను పాటించకుండా ట్రేడ్ లైసెన్స్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే గరిష్టంగా రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. మున్సిపల్ సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

అనాథలకు విద్య అందించడం స్ఫూర్తిదాయకం



నిర్వాహకులు చెక్కును అందజేస్తున్న జీఎం

బెల్లంపల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): రాంజీగోండు నిర్వాహకులు అనాథపిల్లలను చేర దీసి విద్యను అందించడం స్ఫూర్తిదాయకమని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. శనివారం సీఎస్ఆర్ నిధుల నుంచి రాంజీగోండు విద్యార్థి నిలయం కమిటీ సభ్యులకు 3,73,300 చెక్కును అందజేశారు. ఎంతో మంది అనాథలను చేరదీస్తూ విద్యను అందిస్తూ విద్యా నిలయాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ సత్యనారాయణ, సీనియర్ పీవో శంకర్, ఆశ్రమ నిర్వాహకులు గౌరవ అధ్యక్షులు కె. విద్యాసాగర్ పాల్గొన్నారు.

విభిన్న పక్షులు, సీతాకోక చిలుకల గుర్తింపు

హాజీపూర్, జూలై19 (ఆంధ్రజ్యోతి): పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో క్వారీ జంగిల్ సఫారీ రోడ్డులో అటవీశాఖ అధికారులు విభిన్న రకాల పక్షులు, సీతాకోక చిలుకలను గుర్తించారు. మహారాష్ట్ర వైల్డ్ లైఫ్ వార్డెన్ రంజాన్, రేంజ్ అధికారి సుభాష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బట్టర్‌ఫ్లై, బర్డ్స్ వాచ్ కార్యక్రమంలో 30 రకాల బట్టర్ ఫ్లైలు, పక్షులను గుర్తించారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమం

తాండూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగళ్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని ఎంఈవో మల్లేష్‌కు విన్నవించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీ, పెండింగ్ డీఏలను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్

కోటపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ రాజశేఖర్ ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఎన్నికల విధులు చేపట్టారు. ప్రిసైడింగ్ అధికారి, అబ్జర్వర్, ఏపీవో, ఓపీఓలు, వైద్య సిబ్బంది, బీఎల్‌వోలు ఇలా విధులన్నీ విద్యార్థులే చేపట్టగా పోలింగ్ కేంద్రంలో విద్యార్థులే ఎన్నికల సిబ్బందిగా అవతారం ఎత్తారు. 9 మంది పోటీలో నిలిచారు. ఈ పాఠశాలకు చెందిన 442 మంది విద్యార్థులు ఓట్లు వేయగా ఇందులో 10వ తరగతికి చెందిన రఘువరన్ అనే విద్యార్థి హెడ్ బాయ్‌గా, మనస్విత అనే విద్యార్థిని హెడ్ గర్ల్‌గా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకులుగా సలీం, సురేందర్, శంకర్, రాజశేఖర్‌లు వ్యవహరించారు.




ఓటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

అమ్మతో ఒక మాట

గురుకుల విద్యార్థులకు అందుబాటులో ఫోన్‌లు

- ఇంటి బెంగదూరమైందంటున్న విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు



గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడుతున్న విద్యార్థి

బెల్లంపల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో చదువుకొంటున్న విద్యార్థులకు తల్లిదండ్రులతో మాట్లాడడానికి ఫోన్‌లను అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. గతంలో తమ పిల్లలను కలిసేందుకు వచ్చే తోటి విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్‌లు, ఉపాధ్యాయుల ఫోన్‌లతో తమ కుటుంబ సభ్యులతో మాట్లాడేవారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం గురుకుల సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో ఫోన్‌మిత్ర పేరుతో అమ్మతో ఒక మాట అనే కార్యక్రమాన్ని చేపట్టి ఫోన్లు ఏర్పాటు చేసింది. దీంతో కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి బెంగపడే విద్యార్థులకు ఊరట లభించింది.

చదువుకు దగ్గరై ఇంటి బెంగ దూరమై...

గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు దూరంగా ఏ పాఠశాలలో సీటు వస్తే ఆ పాఠశాలలో చదువుకోవాలి. దీంతో ఇంటి బెంగతో విద్యార్థులు ఎంతో ఇబ్బందిపడేవారు. ఒక్కోసారి పాఠశాలల్లో ఏదైన సమస్య ఉన్నా చెప్పుకోలేని పరిస్థితి ఉండేది. దీంతో ఎంతో మంది మానసికంగా క్రుంగి సెలవుల్లో ఇంటికి వెళితే మళ్లీ పాఠశాలకు రావాలంటే ఇబ్బందిపడేవారు. అంతేగాకుడా తోటి విద్యార్థులు ఏదైన ర్యాగింగ్, ఇతరత్రా విషయాల్లో ఇబ్బందులు పెట్టిన పాఠశాలల్లో సమస్య నెలకొన్న బయటికి చెప్పుకోలేని పరిస్థితి ఉండేది. కొందరైతే తమ సమస్యను చెప్పుకోలేక గురుకుల పాఠశాలల్లో పలువురు విద్యార్థులు ఆత్మహ త్యచేసుకున్న సంఘటనలు సైతం లేకపోలేదు. గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో ఏదైనా సమస్య ఉంటే విద్యార్థులు గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫోన్‌తో నేరుగా టోల్‌ఫ్రీ నెంబర్‌తో అధికారులకు ఫిర్యాదు చేసే సదుపాయం ఉంది. దీంతో విద్యార్థులు గురుకులాల్లో ఎలాంటి సమస్య ఉన్నా ఫిర్యాదు చేసే అవకాశంసైతం ఏర్పడింది. దీంతో ఎంతో మంది విద్యార్థులు చదువుకు దగ్గరై ఇంటి బెంగ దూరమయ్యే అవకాశాలు లేకపోలేదు.

నలుగురు విద్యార్థులకు కలిపి ఒక స్మార్ట్ కార్డు

ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి గురుకుల సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో ఫోన్ మిత్ర పేరిట ఫోన్లు ఏర్పాటు చేసింది. దీనిని అమ్మతో ఒక మాట అనే కార్యక్రమాన్ని గురుకులాల్లో ప్రారంభించారు. ప్రతి నలుగురు విద్యార్థులకు కలిసి ఒక స్మార్ట్ కార్డుతో రోజులో 25 నిమిషాల పాటు తల్లిదండ్రులతో మాట్లాడే వీలుంటుంది. కేటాయించిన ఫోన్‌లో ముందుగా స్మార్ట్‌కార్డు ఇచ్చే సమయంలో తల్లిదండ్రులకు సంబంధించిన ఏదో ఒక నెంబర్‌ను పాఠశాల సిబ్బందితో నమోదు చేయించుకోవాలి. ఏ ఫోన్ నెంబర్ నమోదు చేశారోదానికి మాత్రమే స్మార్ట్‌కార్డు సేవలను వినియోగించేలా సాంకేతికతను వినియోగించారు.

సంతోషంగా ఉంది...

కె. గణేష్, గురుకుల పాఠశాల విద్యార్థి



గురుకుల పాఠశాలలో ఫోన్లు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. గతంలో మా తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడేం దుకు చాలా ఇబ్బందులు ఉండేవి. ఇప్పు డు ఆ సమస్య తీరిపోయింది. ఏదైన సమస్య ఉన్న నేరుగా తల్లిదండ్రులకు చెప్పుకునే అవకాశం ఉండడంతో ఇంటి బెంగ దూరమైంది.

విద్యార్థులకు భయం తొలగిపోతుంది...

సంతోష్, ప్రిన్సిపాల్ గురుకుల పాఠశాల



ప్రభుత్వం ఫోన్ మిత్రలో భాగంగా గురుకుల పాఠశాలలో ఫోన్‌లు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు భయం తొలగిపోవడమే కాకుండా ఒంటరితనం దూరమవుతుంది. విద్యార్థులు చదివే గురుకులాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, సమస్యలు ఉన్నా తల్లిదండ్రులకు చెప్పుకునే అవకాశం ఉంటుంది. విద్యార్థులు ఇంటికి దూరమయ్యామనే బెంగలేకుండా చదువుపై మంచిగా దృష్టి సారించవచ్చు. ఫోన్ల ఏర్పాటుతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన మంచిర్యాల వాసి

మంచిర్యాలక్రైం, జూలై19 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో ఈ నెల 14 నుంచి 18వరకు జరిగిన బాడ్మింటన్ టోర్నమెంటులో అండర్-19 సింగిల్ విభాగంలో మంచిర్యాలకు చెందిన అరుగువెల్లి అర్జున్‌రెడ్డి విన్నర్‌గా నిలిచాడు. పట్టణంలోని హైటెక్ సిటీకి చెందిన రఘునాథ్ రెడ్డి-హేమ కుమారుడు అర్జున్‌రెడ్డి బాంబేలో బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందాడు. శుక్రవారం నాందేడ్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అర్జున్‌రెడ్డి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకని అండర్-19 సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచాడు. ఆ రాష్ట్ర ప్రముఖుల చేతుల మీదుగా జ్ఞాపికను స్వీకరించాడు. సెప్టెంబర్‌లో జరిగే జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించడంతో హైటెక్ సిటీ కాలనీ వాసులు ఆయనను అభినందించారు.

పంచాయతీ ఇండెక్స్‌పై సమావేశం

వేమనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) :వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై శనివారం అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేవంలో ఎంపీడీవో, ఎంపీవో, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

చెన్నూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. వామపక్ష విద్యార్థి నాయకులు శ్రీకాంత్, చరణ్, సన్నిగౌడ్ మాట్లాడుతూ బంద్‌కు అందరు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాహుల్, సుమంత్ పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ముందస్తు బోనాల సందడి



బోనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



దండేపల్లి కస్తూర్బా విద్యాలయంలో...

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో శనివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మహిళ అధ్యాపకురాలు బోనమెత్తి అమ్మవారికి బోనం సమర్పించారు. కళాశాల చైర్మన్ పల్లె భూమేష్, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే మంచిర్యాలలోని లక్ష్మీనగర్ శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల జనరల్ మేనేజర్ అరవింద్‌రెడ్డి, ప్రిన్సిపల్ అయూబ్, నాగరాజు, రోజారాణి, అనగమాత, కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఆషాఢమాస బోనాల జాతర ముగింపు పురస్కరించుకుని దండేపల్లిలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాల జాతర వేడుకలను నిర్వహించారు. విద్యాలయ ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, బాలికలు ఉన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ కాసిపేట గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఆశాఢ మాస బోనాల వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రి న్సిపాల్ అశ్విని సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని శ్రీక్రిష్ణవేణి పాఠశాలలో విద్యార్థులు పోతురాజుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ సతీష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

హాజీపూర్: మండ లంలోని దొనబండ శ్రీ చైతన్య హైస్కూల్‌లో విద్యార్థులు వివిధ వేషధారణలతో సందడి చేశారు. గుడిపేట రివిలేషన్ స్కూల్‌లో నర్సరీ విద్యార్థులు, గౌతమి స్కూల్‌లో ముందస్తు బోనాల వేడుకలు జరిపారు.

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట, కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాలల్లో బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. సుధాకర్, సాంబమూర్తి మాట్లాడారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేట శ్రీచైతన్య పాఠశాలలో బోనాల వేడుక

'స్థానిక ఎన్నికల్లో బరిలో ఉంటాం'..

బెల్లంపల్లి, జూలై19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో సీపీఐ పార్టీ బరిలో ఉంటుందని విజయమే లక్ష్యంగా నాయకులు ముందుకు వెళ్లాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్ అన్నారు. శనివారం పట్టణం లోని సీపీఐ కార్యాలయంలో బెల్లంపల్లి మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి సీపీఐ తరుపున నాయకులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆరు గ్యారంటీలను అమలు చేయాలని జిల్లా మహా సభల్లో తీర్మాణాలను చేశామన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ నాయకులు రామడుగు లక్ష్మణ్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మేకల రాజేశం, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

వేమనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువుల దుకాణాలను శనివారం జిల్లా వ్యవసాయాధికారి చాత్రు నాయక్ ఆకస్మికంగా పరిశీలించారు. నీల్వాయి, ముల్కలపేట, గొర్లపల్లి, వేమనపల్లి, సుంపుటం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను సందర్శించి స్టాకు రిజిష్టర్‌లను, నిల్వలను అడిగి తెలుసుకున్నారు. నీల్వాయి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని యూరియా అమ్మకాల తీరును పరిశీలించారు. పీఎం కిసాన్ నగదు రావాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో భూమి ఉన్న ప్రతి ఒక్క రైతు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రేపటి బంద్‌ను విజయవంతం చేయాలి

కాసిపేట, జూలై19 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 49ని రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సంఘాలు సోమవారం జిల్లా బందుకు పిలుపునిచ్చాయి. జిల్లా బందును విజయవంతం చేయాలని ఆదివాసీ తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు అడె జంగు అన్నారు. శనివారం కాసిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఆదివాసీ అస్తిత్వానికి భంగం కలిగించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బందును విజయవంతం చేయడంలో ఆదివాసీ గిరిజన సంఘాలు విద్యార్థులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, మండల అధ్య క్షులు సంద్ర భూమయ్య పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు

దండేపల్లి జూలై 19 (ఆంధ్రజ్యోతి): దండేపల్లిలో వెన్నల స్వయం సహాయక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు సంబరాలు చేసుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత ఏపీఎం భూపతి బ్రహ్మయ్య, సీసీ సురేందర్, వివోఏ విజయ, వెన్నల వివో గ్రూప్ లీడర్లు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

సహకార సంఘాల విస్తరణ ఎప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోవడంతో నూతన విధానానికి మంగళం పాడినట్లయింది. ఈ విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా సానుకూలంగా స్పందిస్తుందో...లేదోనన్న స్పష్టత రావలసి ఉంది.

విభజిస్తేనే సేవలు విస్తృతం...

వ్యవసాయంలో రైతులకు అన్ని రకాలుగా వెన్నుదన్నుగా ఉండే సహకార సంఘాల సేవలను మరింతగా విస్తరిస్తేనే మరింతగా ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కొత్తగా 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. అదే తరహాలో రైతులకు అందుబాటులో ఉండేలా సొసైటీలను విభజించాలనే విజ్ఞప్తులు ఉన్నాయి. ఒక్కో సొసైటీలో వేలాది మంది రైతులు సభ్యులుగా ఉండగా, ఏ అవసరం వచ్చినా క్యూలు కట్టాల్సి వస్తోంది. ప్రతి సీజన్ ఆరంభంలో ఎరువులు, విత్తనాల కోసం రైతులు బారులు తీరిన సందర్భాలు అనేకం ఉన్నాయి. జిల్లాలో ప్రస్తుతం 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా, వాటి పదవీ కాలం వాస్తవంగా 2025 ఫిబ్రవరి 15తో ముగిసింది. దీంతో ప్రభుత్వం ఆరు నెలలపాటు గడువు పొడిగించింది. ఆ గడువు కూడా వచ్చేనెల 15తో ముగియనుంది. ఇకనైనా ఎన్నికలు నిర్వహిస్తారో...లేదో తెలియకుండా ఉంది. అయితే సహకార సంఘాల ఎన్నికలకు ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ కారణంగా సహకార సంఘాల ఎన్నికలు మరింతగా ఆలస్యం కానున్నాయి. ఈ క్రమంలో సహకార సంఘాల పదవీ కాలం మరోమారు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం సహకార సంఘాలను విస్తరిస్తే జిల్లాలో మరో 16 సంఘాలు కొత్తగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. అప్పుడు జిల్లాలోని రైతులకు సహకార సంఘాల సేవలు సైతం విస్తరించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వమైనా సహకార సంఘాల విస్తరణను సానుకూల దృక్పథంతో చూడాలని జిల్లాలో ని రైతులు కోరుతున్నారు.

తీన్మార్ మల్లన్నపై దాడి చేసిన వారిని శిక్షించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ నాయకుడు తీన్మార్ మల్లన్నపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాలలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ హైద్రాబాద్‌లో తీర్మాన్ మల్లన్న ఆఫీసుపై జరిగిన దాడిలో పాల్గొన్న వారిని ప్రేరేపించిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. సంఘం నాయకులు కొండయ్య, రాజేశం, మల్లయ్య, యాదగిరి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కోటపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటి గోడ కూలి కోటపల్లికి చెందిన ఇద్దరు కూలీలు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను శనివారం బీఆర్ఎస్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ డాక్టర్ రాజారమేష్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. అనంతరం వారికి బియ్యం, సరుకులు, ఆర్థిక సహాయం అందించారు. పార్టీ నాయకులు సాంబగౌడ్, సత్యనారాయణ ఉన్నారు.

పాఠశాలలో గ్రీన్‌డే సంబరాలు



లక్షెట్టిపేట పట్టణంలోని రాఘవేంద్ర కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో శనివారం గ్రీన్‌డే సెలబ్రేషన్ ఘనంగా నిర్వహించారు. అడ్మినిస్ట్రేటర్ శిల్ప, పాఠశాల ప్రిన్సిపల్ అనీల్‌కుమార్ పాల్గొన్నారు. -లక్షెట్టిపేట

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న పురుషోత్తం నాయక్

కాసిపేట, జూలై19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని ఉత్తమపౌరులుగా ఎదగాలని మండల ప్రత్యేకాధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ అన్నారు. శనివారం రేగులగూడెం ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. ప్రతీ విద్యార్థి తరగతి నుంచే మంచి క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. ఉన్నతమైన చదువుల వల్ల విజ్ఞానం పెరిగి అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. చదువుపట్ల ఆసక్తి పెంచుకొని ఇష్టంతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించి సకాలంలో పాఠశాలకు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. లక్ష్మీ, కొండు జనార్ధన్, సుమన్, పాఠశాల ఉపాధ్యాయులు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను సాధించినప్పుడే సంస్థ అభివృద్ధి

జైపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో నిర్ధేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించి నప్పుడే సంస్థ అభివృద్ధి చెందుతుందని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్‌ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇందారం ఓసీపీ లో నూతనంగా అధికారులకు నిర్మించిన గదులను శనివారం ప్రారంభించారు. డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి, అధికారి సమిష్టిగా కృషి చేస్తేనే ఓసీపీలు, భూగర్భ గనులు వార్షిక లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

లక్షెట్టిపేట, జులై 19(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కందుల ఖుషీంద్ర వర్మ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 1360వ ర్యాంక్ సాధించాడు. శనివారం గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఖుషీంద్రవర్మతో పాటు ఆయన తండ్రి ప్రవీణ్‌కుమార్‌ను సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్‌రాథోడ్ సన్మానించి అభినందించారు.

విద్యార్థులకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు నీటిపై హక్కును సాధించేందుకు ప్రజల్లో చైతన్యం కల్పించాలన్న లక్ష్యంతో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా బనకచర్ల నీటి హక్కుల కసం జంగ్ ఉద్యమం వేగంగా ముందుకు సాగుతోందని చెప్పారు. ఇందులో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నాయకులు ముస్తాఫా, రాజ్‌కుమార్, శ్రావణ్, శ్రీకాంత్, కోటేశ్వర్, ఆర్పాష్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

ఆసిఫాబాద్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో శనివారం ఆసిఫాబాద్ ఎస్‌బీఐ శాఖ సహకారంతో నిర్మాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే బెంచీలు, కుర్చీలు అందజేయడంతో పాటు కంపౌండ్‌వాల్, గేటు, భవనానికి రంగులతో పాటు నాణ్యమైన తాగునీరు అందించేందుకు ప్యూరీఫైడ్ మిషన్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు రత్నాంజలి, సుధారాణి, రజిత, హెచ్‌ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సోమవారం విశ్రాంత ఉద్యోగులకు కంటి పరీక్ష శిబిరం నిర్వంచనున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- జిల్లాలో పెరిగిన ఎంపీటీసీ స్థానాలు
- 42 శాతం రిజర్వేషన్ అమలుతో బీసీలకు పెరగనున్న అవకాశాలు
- పార్టీ టికెట్ల కోసం ఆశావహుల యత్నాలు
- నేతల దృష్టిలో పడేందుకు ఆరాటం



లెక్క తేలింది..

చింతలమానేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఒక్కో అడుగు పడు తోంది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లా, మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలతో పాటు మండల ప్రజా పరిషత్ స్థానాలను ప్రకటించింది. ఈ ప్రకారం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 127 ఉండగా, జడ్పీటీసీ, ఎంపీపీలు 15గా లెక్క తేల్చారు. దీంతో ఎన్నికలకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల అమలు చేస్తామని చెప్పడంతో ఆశావహులు పావులు కదుపుతున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఇక పెద్దపీట ఉండబోతుంది. దీంతో రాజకీయ పరంగా బీసీలకు ప్రాతినిధ్యం పెరగుతోంది. బీసీ రిజర్వేషన్‌ను 42శాతానికి పెంచుతూ ఆర్డినెన్స్ జారీ చేయాలని ఇప్పటికే కేబినేట్ నిర్ణయించింది. గవర్నర్ వద్దకు ఫైల్ వెళ్లింది. గవర్నర్ ఆమోదం పొందిన వెంటనే ఆర్డినెన్స్ జారీ అవకాశం ఉంది. ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబం ధించి ప్రత్యేక జీవోను విడుదల చేస్తారు. జీవోల పేర్కొన్న వివరాల ప్రకారం మండల, జిల్లా, గ్రామ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాల నుంచి పోటీ చేయాల నుకునే ఆశావహుల ఆశలు చిగురిస్తున్నాయి ఇప్పటికే ఆశావహులు ప్రధాన పార్టీల టికెట్ల కోసం పావులు కదుపుతున్నారు. నోటిఫికేషన్, రిజర్వేషన్లు ఖరారు కాగానే తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం అవుతున్నారు. బీసీలకు కేటాయించబోయే 42శాతం రిజర్వుడ్ స్థానాలతో పాటు జనరల్ స్థానాల్లోనూ స్థాని కంగా బలమున్న బీసీ నాయకులు సత్తా చాటే అవ కాశం ఉన్నది. దీంతో మెజార్టీ స్థానాల్లో బీసీల ప్రాతి నిధ్యం పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేకులు అంచనా వేస్తున్నారు.

● ఇక ఎన్నికల సందడి..

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారైన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 15 జడ్పీటీసీలు, 15 ఎంపీపీలు స్థానా లు ఉన్నాయి. ఇందులో బీసీలకు సుమారుగా 6 చొప్పు న స్థానాలు బీసీలకు రిజర్వు అయ్యే అవకాశం ఉన్నది. ఎంపీపీలు కూడా అదే స్థాయిలో దక్కే అవకాశం ఉన్నది. గతంలో ఎంపీటీసీ స్థానాలు 123 ఉన్నయి. ప్రస్తుతం 127కు పెరిగాయి. 335 గ్రామ పంచాయతీల్లో 140 స్థానాల వరకు బీసీలకు కేటాయించే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. ఈ మేరకు బీసీలకు ప్రభు త్వం పదవుల పరంగా పెద్ద పీట వేయనుందని రాజకీ య విశ్లేషకులు భావిస్తున్నారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తారన్న ఊహాగానాలకు రాష్ట్ర వ్యాప్తంగా స్థానాలను ఖరారు చేయడం బలాన్ని చేకూరుస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో ని 335 గ్రామ పంచాయతీల్లో 3,48,368 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల కాలంలో కొత్త ఓటర్లు పెరిగి నట్లు చెబుతున్నారు. సర్పంచ్ ఎన్నికలు తర్వాత జరిగే అవ కాశం ఉన్నది. సెప్టెంబరు 30 లోపు అన్ని స్థానిక ఎన్ని కలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

● ఏడాదిన్నర కాలంగా..

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం గతేడాది జనవరి 31తో ముగిసింది. అప్పటి నుంచి ఆ గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. ఆ తర్వాత గతేడాది జూన్‌లోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ల పదవీ కాలం కూడా ముగిసింది. ఆ తర్వాత మున్సిపాలిటీలు, మెజార్టీ మున్సిపల్ కార్పొరేషన్‌లలోనూ పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రస్తుతం స్థానిక సంస్థలన్నీ దాదాపుగా ప్రత్యేకాధికారుల పాలనలోనే నడుస్తున్నాయి. ప్రభుత్వా నికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశ్యం ఉన్నప్పటికీ కులగణన బీసీ రిజర్వేషన్ల హామీ కారణంగా ఈ ప్రక్రియలో జాప్యం జరిగింది. త్వరలోనే ఆర్డినెన్స్ ఇవ్వడంతో పాటు స్థానిక సంస్థల్లో వివిధ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ఇవ్వనుంది.

ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

కౌటాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం చింతలపాటి వద్ద నూతనంగా నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. అధికారులతో కలిసి శనివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పనులు, ఫీడర్లు, సహా ఆఫీస్ బిల్డింగ్ ఇతర అంశాలను విద్యుత్ శాఖాధికారులతో అడిగి తెలుసుకున్నారు. ప్రారంభో త్సవానికి అన్ని విధాల ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రోగులకు సరైన వైద్యం అందించాలన్నారు. పాత పీహెచ్‌సీ భవనం పరిశీలించి అక్కడ ఆక్రమణలు జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమోద్‌కుమార్, ఎంపీడీవో రమేష్, కార్యదర్శి సాయికృష్ణ, విద్యుత్ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్‌లో నిరసన తెలియజేస్తున్న వర్కర్లు

ఆసిఫాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బీసీ పోస్టు మెట్రిక్ హాస్టల్స్ వర్కర్లకు 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 15 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పలుమార్లు డీడీకి విన్నవించామని అన్నారు. రెండు సార్లు బీసీ కమిషనర్‌కు విన్నవించినా తమ సమస్య పరిష్కారం కావడం లేద న్నా రు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరా రు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు తిరుపతి, శారద, పోశక్క, సరోజ, జ్యోతి, పార్వతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేదింటి విద్యార్థికి చేయూత



వంశీకృష్ణకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం నిశాని గ్రామానికి చెందిన పేద విద్యార్థికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో శనివారం ఐఐటీ విద్యార్థి ఆత్రం వంశీకృష్ణకు రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కెరమెరి మండలం నిశాని గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతి కుమారుడు వంశీ కృష్ణ చెన్నైలో ఐఐటీ సీటు వచ్చిందని చెప్పారు. ఉన్నత చదువుల కోసం రూ.50 వేల చెక్కును అందజేశామని అన్నారు. . కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థికి ఆర్థిక సహాయం

సిర్పూర్(యు), జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారా గ్రామ పంచాయితీ పరిదిలో గల తుమ్మగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ నిరుపేద విద్యార్థి మర్సకోల కృష్ణకు శనివారం ఆదివాసీ పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. గత ఏడాది మర్సకోల కృష్ణ కర్ణాటకలోని రాయ్‌చూర్ యూనివర్సిటీ ఐఐటీలో సీటు సాధించాడు. మొదటి సంవత్సరం పూర్తి కావడంతో రెండో సంవత్సరం చదవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయంను తెలుకుని ఆదివాసీ పోలీసు వెల్ఫేర్ అసోసియషన్ ఆధ్వర్యంలో కృష్ణకు 22 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ పోలీసు వెల్ఫేర్ అసోసియషన్ సీనియర్ సభ్యులు ఆర్క గోవింద్‌రావు, వెంకట్‌రమణ, ఆత్రం బహదూర్‌షా, మడావి శంకర్, తీర్మాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు

బెజ్జూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకు వచ్చిన జీవో 49ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తలపెట్టిన జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు కోరారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. బెజ్జూరులో సైతం వ్యాపార సంస్థ లు, విద్యా సంస్థలు బంద్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించ తలపెట్టిన ఉమ్మడి జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కుమ్ర భీంరావు, ప్రధాన కార్యదర్శి ఆత్రం నాగోరావు కోరారు. మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడారు. ప్రభుత్వాలు ఆదివాసీల ఉనికి అస్థిత్వం మనుగడను దెబ్బతీసే టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ప్రాజెక్టును కుమరం భీం ఆసిఫాబాద్‌కు విస్తరిస్తూ తీసుకోవచ్చిన జీవో 49ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తుడం దెబ్బ మండల గౌరవ అధ్యక్షుడు పెందోర్ శంకర్, ఉపాధ్యాక్షుడు ఆత్రం దౌలత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందక రైతులకు తప్పని అవస్థలు

చింతలమానేపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యూరియా అందక రైతులు అవస్థలు పడుతూ ఉంటే పట్టించుకోని రేవంత్‌రెడ్డి తానే ఇంకా పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉంటానని ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎద్దేవా చేశారు. చింతలమానేపల్లి మండం డబ్బా గ్రామంలో యూరియా పంపిణీ కేంద్రంలో శనివారం రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు రాజ్యం తామే తెచ్చామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు యూరియా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. ప్రజాపాలన రైతు రాజ్యం అంటే రైతులను రోజంతా క్యూలైన్లలో నిలబెటడమా అని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ మంత్రి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఐదుళ్లుగా ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు యూరియా పంపిణీ ఆపేయడం సరికాదన్నారు. విత్తనాలు ఇచ్చి వారి పంటను కొనుగలు చేసే ప్రభుత్వం వారికి యూరియా ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. ఎకరానికి రెండు యూరియా బస్తాలు ఇవ్వాల్సిన చోట ఒకటి ఇస్తున్నారని అవి కూడా సకాలంలో ఇవ్వడం లేదని చెప్పారు. ఇంకో ఐదు రోజు లు యూరియా అందక పోతే పంట నాశనమయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు కావాల్సినంత యూరియా సకాలంలో అందేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వ కాలంలో రైతులు ఏనాడు అసౌకర్యానికి గురికాలేదని కాంగ్రెస్ పాలనలో రైతులు కన్నీరు పెడుతున్నారన్నారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే ఉన్నా ప్రయోజనం లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో మాట్లాడి ఒక్క యూరియా బస్తా తెప్పించే పరిస్థితి కూడా లేదన్నారు. అనంతరం దిందా వాగులో ప్రమాదవ శాత్తు జారిపడి మృతి చెందిన సు మన్ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబా న్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కలెక్టర్ ప్రమాదాన్ని గుర్తించి సాయం చేయాలన్నారు. తునికాకు సేకరించి ఏడాది దాటినా ఇప్పటి వరకు బకాయిలు చెల్లించలేదని అందువల్ల ఈ ఏడాది ఎవరు కూడా తునికాకు సేకరణకు వెళ్లలేదన్నారు. అనంతరం కేతిని గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కాసేపు ఆటలు ఆడి వారిని ఉత్సాహపరిచారు. బాగా చదివి ఉద్యోగాలు చేయాలని, రోజు వార్తా పత్రికలు చదవాలని సూచించారు. ఆయన వెంట శ్యాంరావు, లహంచు, మనోహర్, శ్రీనివాస్, షాకీర్ ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్

● సంక్షిప్తం..

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను శనివారం పట్టణ వస్త్ర వ్యాపారులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సిందం శ్రీనివాస్, పట్టణ వస్త్ర వ్యాపారులు వెంకన్న, రామగిరి శేఖర్, శ్రీనివాస్, రాచర్ల మధూకర్, శ్రీనివాస్, సోను పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో బైపీసీలో 25, ఎంపీసీలో 25 సీట్లు ఖాళీగా ఉన్నాయని కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న తెలిపారు. సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): సోమిని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పెంచికలపేట పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అనార్తి హల్దార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భిక్షమయ్య పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): లంబాడీహెట్టిలో డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, డైరెక్టర్లు రామయ్య, రాజయ్య పాల్గొన్నారు.

ముందస్తు బోనాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

కాగజ్‌నగర్/రెబ్బన, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌తో పాటు, రెబ్బన మండలంలోని పాఠశాలల్లో శనివారం ముందస్తు బోనాల వేడుకలు నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలో పలు పాఠశాలల్లో వేడుకల సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బోనాల పండుగ ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు. రెబ్బెన మండలంలోని సాయి విద్యాలయం (ఎస్‌వీ) లో శనివారం బోనాలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సింగరేణి అధికారి డీకొండ సాయి, కరస్పాండెంట్ విజయ్ కుమారి, ప్రధానోపాధ్యాయుడు సంజయ్‌కుమార్, డైరెక్టర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో గోరింటాకు వేడుకలు



గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థినులు, ఆచార్యులు, తల్లిదండ్రులు గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోరింటాకు విశిష్టతను ఆచార్యులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు, అచార్యులు శారద, హరిత, సరిత, అమరావతి, అరుణ, శైలజ, కిరణ్, శ్రీలక్ష్మి, ప్రశాంతి, లావణ్య, రూప, విజయ, గాయత్రి, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ రామ్మోహన్

బెజ్జూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. మండ లంలోని కుంటలమానేపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్య అందినప్పుడే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. వర్షాకాలంలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవాళి మనుగడ ఉంటుందని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు మొక్కల వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో సునీత, ఏపీవో రాజన్న పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

వాంకిడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలోని మహాబోధి మహా విహార్ భారతీయ బౌద్ధులకు అప్పగించాలని ఈ నెల 25, 26 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ మైదానంలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని భారతీయ బౌద్ధమహా సభ జిల్లా అధ్యక్షుడు అశోక్ కోరారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ఢిల్లీకి తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, మహేష్, లక్ష్మీబాయి, భీంరావు, ప్రసాద్, దిలీప్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మొక్కలపై పట్టింపేది?

లింగాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మండలం పిక్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి పక్కన మొక్కలను నిర్లక్ష్యంగా పడవేశారు. ఓ వైపు ప్రభుత్వం విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచిస్తుంటే మరో వైపు అధికారులు పట్టించుకోకపోవడంతో మొక్కలు ఇలా ఎండిపోతున్నాయి. ప్రభుత్వం వేలాది రూపాయలు ఖర్చు పెట్టి నర్సరీలలో లక్ష్యానికి సరిపడా మొక్కలు సిద్ధం చేయాలని చెబుతుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ పడితే అక్కడ పదుల సంఖ్యలో మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన పడేసిన మొక్కలు